# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 145 క్రిష్ణా, గురువారం 19- 02 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లో ప్రమాదం

### సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి ఢీకొన్న వాహనాలు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 18: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ కాన్వాయ్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. అయితే ఆ సమయంలో ఆయన కాన్వాయ్‌లో లేరు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం కాన్వాయ్ పవన్‌కల్యాణ్ వద్దకు వెళుతున్న సమయంలో సిరిపురం జంక్షన్ వద్ద అందులోని ఒక వాహనం సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాన్వాయ్‌లో ఉన్న చివరి వాహనం మాత్రం డ్యామేజ్ అయింది. ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్ సీఐ అమ్మినాయుడు, త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణలపై విచారణ చేపట్టారు.

అప్పన్న హుండీ ఆదాయం 1.49 కోట్లు

సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు గత 21 రోజుల్లో హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా సుమారు రూ.1.49 కోట్లు ఆదాయం సమకూరింది. దేవస్థానం ఈవో జె.వెంకటరావు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో బుధవారం పరకామణి కేంద్రంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. ఇందులో రూ.1,49,03,091 నగదు రూపంలో, 187 గ్రాముల స్వర్ణం, 5.775 కిలోల రజితం ఆభరణాల రూపంలో లభించింది. యూఎస్‌ఏకు చెందిన 190 డాలర్లు, యుఏఈకు చెందిన 90 దీరమ్స్, ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 20 వేల మింగ్స్, మలేషియాకు చెందిన 1,980 ఆర్‌ఎంఎస్‌లు, ఆస్ట్రేలియాకు చెందిన 100 డాలర్లు, ఇంగ్లాండ్‌కు చెందిన ఐదు పౌండ్లు, ఒమన్, సింగపూర్, నేపాల్, ఖతర్, సౌదీ దేశాల కరెన్సీ లభించింది. కార్యక్రమంలో వివిధ విభాగాల చెందిన ఏఈవోలు, పర్యవేక్షణాధికారులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ అసెంబ్లీ.. రోడ్ల విస్తరణలో చెట్ల తొలగింపుపై మంత్రి జనార్దన్ సమాధానం



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 18: ఏపీ అసెంబ్లీలో రోడ్ల విస్తరణలో చెట్ల తొలగింపు విషయంపై ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మంత్రి మాట్లాడారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్క రోజు మీటింగ్ కోసం వందల సంవత్సరాల చరిత్ర ఉన్న మొక్కలను నరికివేసిన దుస్థితి ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల విస్తరణ పనుల్లో అడ్డువచ్చే చెట్లను మాత్రమే తొలగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. జాతీయ రహదారుల పచ్చదనం కోసం సివిల్ పనుల ఖర్చులో 1 శాతం.. హైవేల వెంబడి మొక్కల పెంపకం, నిర్వహణకు కేటాయిస్తున్నారని మంత్రి తెలిపారు. రోడ్డు మధ్య, ఇరువైపులా అవెన్యూ మొక్కలు నాటాలని మార్గదర్శకాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర రహదారులకు సంబంధించి 'రైట్ ఆఫ్ వే' భూమి అందుబాటులో ఉన్న చోట రోడ్డు ఇరువైపులా చెట్ల పెంపకం జరుగుతోంది. అందుబాటులో లేని సందర్భంలో అటవీ శాఖ మార్గదర్శకాల ప్రకారం అటవీకరణ భూముల్లో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఏళ్ల తరబడి ఉన్న భారీ చెట్లను ఇతర ప్రాంతాలకు మార్చి నాటేందుకు (ట్రాన్స్‌లొకేషన్) చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. యలమంచిలి నియోజకవర్గంలోనే ఇటీవల దాదాపు 18 చెట్లను నాటినట్లు బీసీ జనార్దన్ వెల్లడించారు. గతంలో సచివాలయానికి వచ్చే రహదారిలో చెట్లు ఎండిపోయిన పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని సంరక్షిస్తున్నామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు రహదారులకు ఇరువైపులా చెట్లు పెంచుతూ పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర: రాష్ట్రపతి



క్రైం కౌంటర్ న్యూస్,విశాఖపట్నం, ఫిబ్రవరి 18: దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్‌ఎస్ సుమేధపై ప్రయాణించారు.నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి.

## బడులకు 5 స్టార్ రేటింగ్: లోకేశ్

### ప్రస్తుతం ఒక్కటీ లేదు.. అన్నింటినీ ఆ పరిధిలోకి తెస్తాం
### వెయ్యి కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
### వైసీపీ తెచ్చిన జీవో 117తో పిల్లలు బడికి దూరం
### కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు చేశాం
### 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానం 33 శాతానికి పెంచాం: మంత్రి లోకేశ్
### 'నాడు-నేడు'లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి: గౌతు శిరీష



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 18 రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ 5స్టార్ రేటింగ్‌లోకి తెస్తామని, రూ.వెయ్యి కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం 'నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆధునీకరణలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని, ఆ పనులకు సకాలంలో బిల్లులు చెల్లించిన విషయం వాస్తవమేనా?' అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలల్ని మూసివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వల్ల పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ జీవో రద్దు చేశామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్‌ఎంసీ అకౌంట్‌లో రూ.200 కోట్లు ఉన్నాయని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించామన్నారు. ఈ రెండూ కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1000 కోట్లు ఖర్చు చేసే అవకాశం వచ్చిందన్నారు. మరోవైపు పాఠశాలల విద్యాభివృద్ధిలో 'వన్ క్లాస్- వన్ టీచర్' విధానం చాలా కీలకమైందన్నారు. గతంలో 3 శాతం పాఠశాలల్లోనే ఈ విధానం ఉంటే.. ఇప్పుడు 33 శాతానికి పెంచామన్నారు. దీనిద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా ఐదు అంశాలను పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు. లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్, పెయింట్స్, బెంచీలు, టాయ్‌లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇస్తున్నామని, అన్ని పాఠశాలలను 5 స్టార్ రేటింగ్‌కు తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క పాఠశాల కూడా 5 స్టార్ రేటింగ్‌లో లేదన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, అవసరమైనచోట పాఠశాల భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. 2014-19లో చేసిన పనులకు బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామన్నారు. తొలుత మాట్లాడిన గౌతు శిరీష గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని, నేటికీ అనేకచోట్ల అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు'లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని కోరారు.

## ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం..



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి; ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు అంటే.. ఈ రోజు (బుధవారం) సభ ప్రారంభమైంది. ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఆడియో వ్యవస్థలో సాంకేతిక లోపం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆడియో వ్యవస్థను బాగు చేసేందుకు సాంకేతిక నిపుణులు ముంబై నుంచి వస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైంది. ప్రభుత్వాసుపత్రుల సామర్థ్యం పెంపుపై పలువురు సభ్యులు ప్రశ్నలు వేశారు. అందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జవాబు ఇచ్చారు.

ఆళ్లగడ్డ, వాయల్పాడు, పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు, నెల్లూరు జిల్లా కోవూరులలో 50 పడకల ఆసుపత్రిలను 100 పడకల ఆసుపత్రిగా మార్చాలంటూ ప్రభుత్వానికి టీడీపీ ఎమ్మెల్యే అఖిల ప్రియ విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డలో 50 పడకలు ఆసుపత్రిని కూటమి ఏర్పాటు చేసిందని.. దీనిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే మాజీ ఎమ్మెల్యే, తన తల్లి శోభానాగిరెడ్డి యాక్సిడెంట్ జరిగిన తర్వాత.. ఆళ్లగడ్డ అనంతరం నంద్యాల.. అక్కడి నుంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ చేసినప్పుడు గోల్డన్ అవర్ కోల్పోవడం వల్లే ఆమె చనిపోయారని ఈ సందర్భంగా అఖిల ప్రియ గుర్తు చేసుకున్నారు. తన తండ్రి విషయంలోనూ అలాగే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వివిధ ప్రమాదాల కారణంగా తమ ప్రాంతంలో లో చాలా మంది చనిపోతున్నారన్నారు. ఆళ్లగడ్డలో వైద్యులు లేరన్నారు. ఎక్సపర్ట్‌లు కూడా లేరని చెప్పారు. అందువల్ల నంద్యాల, కర్నూలుకు రిఫరల్ చేసిన కేసులు వేలలో ఉన్నాయని ఆమె వివరించారు. ఆళ్లగడ్డలో కనీసం ట్రామా సెంటర్ సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే అఖిల ప్రియ కోరారు. దీనిపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. ప్రభుత్వ ఆసుపత్రులో 50 నుంచి 100 పడకల సామర్థ్యానికి పెంచాలంటూ తమకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అయితే ట్రామా సెంటర్లు విషయంలో ప్రతి 100 కిలోమీటర్లుకు ఒకటి ఏర్పాటు చేయాలంటూ ఇప్పటికే కేంద్రం ప్రకటన చేసిందని వివరించారు. ఇంతలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు జోక్యం చేసుకున్నారు. జాతీయ రహదారులపై క్రిటికల్ కేర్ బ్లాక్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.గుడివాడ నియోజకవర్గంలో ఎన్నో ఆరోగ్య కేంద్రాలు ప్రారంభమై.. గత ప్రభుత్వ హయాంలో సగంలో ఆగిపోయాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవేదన వ్యక్తం చేశారు. రుద్రపాక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రామాపురం ఆసుపత్రి పెచ్చులూడిపోయి.. దీన పరిస్థితిలో ఉందన్నారు. కవుతవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇక గుడివాడలో 100 పడకల ఆసుపత్రి ఉందని.. అందులో డయాలసిస్ సెంటర్ సైతం ఏర్పాటుకు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దీనిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. మోటూరు, కవుతవరం, రామాపురంలో ఆసుపత్రుల పనులు పూర్తి కోసం ఇప్పటికే టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. కానీ ఎవరూ రాకపోవడంతో పనులు ఆలస్యం అవుతూందని చెప్పారు. వీలున్నంత తొందరలో ఈ పనులన్నింటిని పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

# నేడే విశాఖలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ..

## భారత్ నుంచి 70కి పైగా నౌకలు, జలాంతర్గాములు



### ప్రత్యేక ఆకర్షణగా ఐఎన్ఎస్ విక్రాంత్
### 'ఐఎన్ఎస్ సుమేధ' నుంచి రాష్ట్రపతి సమీక్ష
### విశాఖకు చంద్రబాబు.. నేడు రివ్యూకు హాజరు

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 18: విశాఖపట్నం తీరంలో అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్)కు సమయం ఆసన్నమైంది. భారత నౌకాదళం నుంచి 70కిపైగా యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు, కోస్ట్‌గార్డు నౌకలు, 20 దేశాల నుంచి మరికొన్ని నౌకలు ఈ రివ్యూలో పాల్గొంటున్నాయి. బంగాళాఖాతంలో బుధవారం ఉదయం 8.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ, విదేశీ నౌకలను సమీక్షించనున్నారు. అంతర్జాతీయ నౌకల సమీక్ష చేస్తున్న తొలి మహిళా రాష్ట్రపతిగా ఆమె చరిత్ర పుటల్లోకి ఎక్కనున్నారు. ఆమె కోసం తూర్పు నౌకాదళం ప్రత్యేకంగా 'ఐఎన్ఎస్ సుమేధ' యుద్ధనౌకను అందంగా తీర్చిదిద్దింది. ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించిన యుద్ధ విమాన వాహన నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఈ సమీక్షలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీనితో పాటు వివిధ నగరాల పేరుతో నేవీ నిర్మించిన నౌకలు ఐఎన్ఎస్ చెన్నై, ఐఎన్ఎస్ విశాఖ, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ మైసూర్.. అలాగే, ఐఎన్ఎస్ రాణా, రణ్‌వీర్, రణ్‌విజయ్, తరఖాన, తమల్, నీలగిరి, హిమగిరి, ఉదయగిరి తదితర నౌకలతో పాటు సబ్‌మెరైన్లు సింధుకీర్తి, సింధుకేసరి, కోస్ట్‌గార్డు నౌకలు రివ్యూలో పాల్గొంటున్నాయి.

హిమగిరి, ఉదయగిరి ఒకేసారి

విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి మంగళవారం విశాఖపట్నంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా నౌకాదళంలో చేరాయి. వేర్వేరు షిప్‌యార్డుల్లో తయారై ఒకేసారి ఒకే చోట కమిషనింగ్ కావడం వీటి ప్రత్యేకత. ప్రాజెక్టు 17ఏలో మొదటిదైన స్టెల్త్ ఫ్రిగేట్ హిమగిరి (ఎఫ్34)ని కోల్‌కత్తాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ నిర్మించగా, ఉదయగిరి (ఎఫ్35)ని ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ రూపొందించింది. భారత నౌకాదళం వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ నౌక కూడా ఇదే కావడం విశేషం. సూపర్ సోనిక్ క్షిపణులు, మీడియం రేంజ్ క్షిపణులు, 76 ఎంఎం మీడియం రేంజ్ గన్, 30 ఎంఎం, 12.7 ఎంఎం ఆయుధాలు, యాంటీ సబ్‌మెరైన్, సముద్రం అంతర్భాగంలో ప్రయోగించే ఆయుధాలు వీటిపై అమర్చారు.

ఐఎఫ్ఆర్‌కు రిహార్సల్స్ పూర్తి

అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష నేపథ్యంలో భారత నౌకాదళం మంగళవారం రిహార్సల్ నిర్వహించింది. నౌకాదళాధిపతి దినేష్ కె త్రిపాఠి ఈ సమీక్ష చేశారు. ఐఎన్ఎస్ సుమేధ యుద్ధనౌక ముందు వెళుతుండగా, వెనుక ఐఎన్ఎస్ సుకన్యలో మీడియా ప్రతినిధులను తీసుకువెళ్లారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన సమీక్ష మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. సముద్రంలో వరుసగా లంగరేసిన నౌకల మధ్య నుంచి రాష్ట్రపతి రథం నెమ్మదిగా వెళుతుండగా, ఆయా నౌకల్లోని సిబ్బంది డెక్ పైకి వచ్చి సుమేధకు సెల్యూట్ చేశారు. రిహార్సల్స్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస విన్యాసాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రాష్ట్రపతి రథం ప్రత్యేకత ఇదీ..

రాష్ట్రపతి రథంగా పిలుస్తున్న ఐఎన్ఎస్ సుమేధ.. సరయూ తరగతికి చెందిన యుద్ధనౌక. దేశీయ పరిజ్ఞానంతో గోవా షిప్‌యార్డులో తయారు చేశారు. ఇది 2014 మార్చిలో నౌకాదళంలో చేరగా, విశాఖపట్నం కేంద్రంగా తూర్పు నౌకాదళం నుంచి సేవలందిస్తోంది. ఇది తీర ప్రాంత గస్తీ నౌక. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఐఎన్ఎస్ విక్రాంత్.. దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన తొలి యుద్ధవిమాన వాహక నౌక. దీని బరువు 43 వేల టన్నులు. పొడవు 262 మీటర్లు. వెడల్పు 62 మీటర్లు. ఎత్తు 59 మీటర్లు. ఇందులో 14 డెక్‌లు ఉంటాయి. 1,700 మంది సిబ్బంది ఉంటారు. దీనికోసం విశాఖపట్నం పోర్టు అవుటర్ హార్బర్‌లో ప్రత్యేకంగా జెట్టీ నిర్మిస్తున్నారు.

35 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న డేగా

తూర్పు నౌకాదళం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన వైమానిక స్థావరం పేరు ఐఎన్ఎస్ డేగా. దీనిని 1991 అక్టోబరులో ప్రారంభించారు. 35 ఏళ్లు పూర్తి చేసుకోబోంది. ఇక్కడ జెట్ విమానాలను నడపడంలో పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఇక్కడే పౌర విమానాశ్రయం కూడా ఉంది. ఈ జూన్‌లో భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైతే విశాఖ విమానాశ్రయాన్ని పూర్తిగా నేవీనే ఉపయోగించుకోనుంది.

విశాఖ చేరుకున్న రాష్ట్రపతి

త్రివిధ దళాల అధిపతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ప్రత్యేక విమానంలో విశాఖకు విచ్చేశారు. ఐఎన్ఎస్ డేగాలో ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠిలు కూడా విశాఖకు వచ్చారు. వీరితో పాటు తూర్పు నౌకాదళం ఉన్నతాధికారులు, విశాఖకు చెందిన ప్రముఖ నాయకులకు రాష్ట్రపతి ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్ రాజ్‌పుత్ హాలులో రాత్రి విందు ఏర్పాటు చేశారు. తర్వాత రాష్ట్రపతి తన విడిదిచోళ సూట్‌కు వెళ్లిపోయారు.

విశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబుఐఎఫ్ఆర్‌లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి విశాఖకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఎంపీ ఎం.శ్రీభరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, నేవీ అధికారులు తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకుని బస చేశారు.

# మండలిలో వైసీపీ రచ్చ!

### హెరిటేజ్‌పై చర్చకు పట్టు.. గంటల తరబడి నినాదాలు
### చైర్మన్ పోడియంను చుట్టుముట్టిన ప్రతిపక్ష సభ్యులు
### సంబంధం లేని అంశాన్ని ప్రస్తావిస్తారా?: మంత్రుల ఆగ్రహం
### పలుమార్లు సభను వాయిదా వేసిన చైర్మన్
### హిందూ దేవుళ్లు, భక్తులపై జగన్ పగబట్టారు: అచ్చెన్న
### కల్తీ లడ్డూ పాపాన్ని దారి మళ్లించేందుకే: కొలుసు
### ఆధారాల్లేని నిందారోపణలు వైసీపీకి అలవాటే: సత్యకుమార్



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 18సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేసిందని ఆరోపిస్తూ మంగళవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు రగడ సృష్టించారు. మండలి ప్రారంభం కాగానే మైకుల్లో సాంకేతిక సమస్య కారణంగా సభను చైర్మన్ గంటసేపు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే.. ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ నెయ్యి సరఫరా చేసిందన్న ఆరోపణలపై చర్చించాలని వైసీపీ సభ్యులు కేఆర్‌జే భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించి, వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పేదలకు ఇళ్ల స్థలాలపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పీహెచ్‌సీ భవనాల పునర్ధురణపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానం ఇస్తుండగా, వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. కొందరు పోడియం పైకి ఎక్కి, హెరిటేజ్‌పై చర్చకు అనుమతించాలని పట్టుబట్టారు. 'హెరిటేజ్ పాలు, పెరుగు, నెయ్యి, కూటమి పాలన, సీఎం చంద్రబాబు విధానాలు కల్తీ.. గోవిందా.. గోవిందా' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పశువైద్యశాలల్లో పరికరాల కొరతపై మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పేందుకు ప్రయత్నిస్తుండగా వైసీపీ సభ్యులు పెద్దగా నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం వద్ద ఆందోళన చేశారు. మంత్రి పార్థసారథి జోక్యం చేసుకుని, శ్రీవారి లడ్డూ విషయంలో వైసీపీ నేతలు చేసిన పాపం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు హెరిటేజ్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హెరిటేజ్ వల్ల ప్రభుత్వానికి, టీటీడీకి ఏ నష్టం జరిగిందో చెప్పాలన్నారు. వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా, ఆ పార్టీ సభ్యులు నినాదాలు కొనసాగించారు. 'మంత్రులు మాట్లాడేటప్పుడు నినాదాలు చేస్తున్నారు. సభను గౌరవించి, పోడియం దిగండి. మీ పార్టీ నేత మాట్లాడతారు' అని చైర్మన్ కోరారు.

# నేవీ ఫైనల్ రిహార్సల్స్ భారీగా తరలివచ్చిన సందర్శకులు

### కిక్కిరిసిన ఆర్‌కే బీచ్ రోడ్డు
### ప్రత్యేక ఆకర్షణగా సిటీ పరేడ్ సన్నాహక ప్రదర్శన

క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 18 అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో భాగంగా ఆర్కే బీచ్‌లో బుధవారం సాయంత్రం తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్తిస్థాయి రిహార్సల్స్ అబ్బురపరిచాయి. నేవీ శక్తి, సామర్థ్యాలను తెలియజేస్తూ ఆద్యంతం ఆకట్టుకున్నాయి. విన్యాసాలను తిలకించేందుకు నగరవాసులు, నేవీ, ఇతర శాఖల అధికారులు, వారి కుటుంబసభ్యులు భారీసంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన విన్యాసాలు అరగంట పాటు కొనసాగాయి.

బాంబుల మోతతో దద్దరిల్లిన తీరం

నేవీకి చెందిన చేతక్, కమోవ్, సీకింగ్ 42 హెలికాప్టర్లు, మిగ్ 29కే, డార్నియర్ యుద్ధవిమానాలు, నిఘా విమానం పీ8ఐ చేసిన ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా మిగ్ 29కే, డార్నియర్ యుద్ధ విమానాలు భారీ శబ్దంతో చేసిన దాడులు అదుర్స్ అనిపించాయి. అనంతరం ఐదు ఫైటర్ జెట్స్ అమితవేగంతో దూసుకువెళ్లిన తీరు సందర్శకులను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. యుద్ధ ట్యాంకులు, నాలుగు బీఎన్‌పీ ఫైటింగ్ హెలికాప్టర్ల విన్యా సాలు కట్టిపడేశాయి. రెండు ఏఎల్‌హెచ్, ఆరు చేతక్ హెలికాప్టర్లతో సముద్రంలో కమెండోలు చేసిన సాహస విన్యాసాలు, ఆయిల్ రిగ్‌ను ధ్వంసం చేసిన తీరు నేవీశక్తి, సామర్థ్యాలను చాటిచెప్పాయి. ఆ తరువాత సుమారు గంటపాటు నిర్వహించిన సిటీ పరేడ్ రిహార్సల్ విశేషంగా ఆకట్టుకుంది. భారత్‌తోపాటు వివిధ దేశాల నేవీ సిబ్బంది, బ్యాండు పార్టీలు పరేడ్‌లో పాల్గొన్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధిగాంచిన కళాకారుల బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించాయి. భారత నేవీ అధికారులు ప్రత్యేకంగా నిర్వహించిన కంటిన్యూటీ డ్రిల్స్ కట్టిపడేశాయి. ఇందులో భాగంగా తుపాకులతో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నౌకల పైనుంచి లేజర్ షో, తీరంలో ఫైర్ వర్క్స్‌తో సాగరం సరికొత్త హంగులను అద్దుకుంది. వీటిని వీడియోలు తీసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు.

పోలీస్ వలయంలో నగరం

ఐఎఫ్ఆర్, మిలాన్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం



బీచ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

ముమ్మరంగా సాగుతున్న వాహన తనిఖీలు ఇంటర్నేషల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్ నేపథ్యంలో నగరంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేశారు. బీచ్‌రోడ్డు పరిసర ప్రాంతాలతో పాటు తీరానికి చేరుకునే మార్గాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఐఎఫ్‌ఆర్, మిలాన్ కోసం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు ప్రపంచదేశాల నౌకాదళ ఉన్నతాధికారులు నగరానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 5,750 మందితో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. సిరిపురం కూడలి, సర్క్యూట్‌హౌస్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి జంక్షన్, ఆంథోనీ నగర్ జంక్షన్, జగదాంబ జంక్షన్‌లలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. పార్క్‌హోటల్ జంక్షన్, కురుపాం టవర్స్ జంక్షన్, ఆల్‌ఇండియా రేడియో జంక్షన్, పందిమెట్ట ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటుచేశారు. బీచ్‌రోడ్డు వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నియంత్రించారు. వాటిని ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. ప్రముఖులు బసచేసిన హోటళ్లు, ప్రయాణించే మార్గాలతోపాటు కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీచ్‌రోడ్డు పరిసరాలు పోలీసులతో నిండిపోయాయి. గురువారం సాయంత్రం బీచ్‌రోడ్డులో జరిగే కార్యక్రమాలను వీక్షించేందుకు హాజరయ్యే సందర్శకుల వాహనాలను ఏపీఐఐసీ మైదానం, ఏయూ జిమ్నాజియం గ్రౌండ్ వద్ద పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అదనపు సిబ్బందిని నియమించారు.

# కమనీయం.. ఆది దంపతుల కల్యాణం

క్రైం కౌంటర్ న్యూస్, శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహా శివరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా ఆది దంపతుల కల్యాణోత్సవం బుధవారం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. పూజలయ్యాక స్వామివారిని గజవాహనంపై, అమ్మవారిని సింహవాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కళాకారుల ఆటలు, పాటల మధ్య ఆదిదంపతులు పెండ్లి మండపం వద్దకు చేరుకున్నారు. మొదట పరమేశ్వరుడు రాగా, మధ్యలో పార్వతీదేవి అలకబూనారు. చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం నిర్వహించి అమ్మవారి అలక తీర్చాక పెండ్లి మండపం వద్దకు చేరుకున్నారు. బుధవారం తెల్లవారు జామున సుమారు 4.30 గంటల ప్రాంతంలో అమ్మవారికి మాంగళ్యధారణ కార్యక్రమాన్ని నిర్వహించి, కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఈ కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో నగరివీధి, నెహ్రూవీధి కిక్కిరిశాయి. ఇదే శుభ ఘడియలో 59 జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యాయి. నూతన వధూవరులకు ముక్కంటి ఆలయం తరఫున మంగళ సూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు.

శాస్త్రోక్తంగా సభాపతి కల్యాణం

బుధవారం రాత్రి సభాపతి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కల్యాణోత్సవాన్ని ముక్కంటి ఆలయ ప్రాంగణంలో అర్చకులు నిర్వహించారు. అనంతరం శివగామి సుందరి సమేత నటరాజస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్ కొట్టె సాయి, ఈవో బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కైలాసగిరి ప్రదక్షిణ

గురువారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు వీడ్కోలు పలికేందుకు స్వామి అమ్మవార్లు 21 కిలోమీటర్ల మేర ప్రదక్షిణకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా రాత్రి రాజగోపురం వద్ద నుంచి స్వామి వారు అశ్వ వాహనంపై, అమ్మవారు సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు. ఈ రాత్రినే రుషిరాత్రి అని కూడా అంటారు.

ట్రాఫిక్ ఆంక్షలిలా.. గిరిప్రదక్షిణ దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. భక్తులకు అన్నదానాలు, వితరణలు చేసే వాహనాలను మాత్రమే ఈ ఏడాది గిరి ప్రదక్షిణ మార్గంలో అనుమతిస్తారు. ద్విచక్ర వాహనాలతోపాటు ఇతర వాహనాలను మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే గిరిప్రదక్షిణ మార్గంలోకి అనుమతించేలా ఆంక్షలు విధించారు.

# పెరుగుతున్న గంజాయి ప్రభావిత నేరాలు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 18: దూమ,మద్యపానం వంటి దురలవాట్లు ఆరోగ్యాన్ని దెబ్బతిస్తాయి. వ్యక్తిగతంగా, కుటుంబానికి నష్టం కలిగిస్తాయి. చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి మహమ్మారి మాత్రం ఆరోగ్యంతో పాటు మానవీయ విలువల్నీ మంటగలుపుతోంది. మృగాలతో కూడా పోల్చలేని స్థాయికి దిగజార్చుతోంది. పసి పిల్లల్ని, పండు ముసలివారిని సైతం కడతేర్చడానికీ వెనుకాడని కసాయి కామాంధులుగా మార్చేస్తోంది. దురదృష్టవశాత్తూ పిల్లల నుంచి పెద్దల వరకు దీని ప్రభావానికి లోనవుతున్నారు. బానిసలుగా మారుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరుగుతున్న కొన్ని గంజాయి ప్రేరేపిత ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

చిన్నారిని చిదిమేశాడు

అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలోని నీరుగట్టువారిపల్లెలో గంజాయికి అలవాటు పడిన కులవర్ధన్.. ఏడేళ్ల బాలికను హత్యాచారం చేసిన వైనం ఒక్కసారిగా ప్రజానీకాన్ని ఉలికిపడేలా చేసింది. స్పృహ లేకుండా బాలిక మృతదేహాన్ని నీళ్ల డ్రమ్ములో పడేసి అక్కడే రాత్రంతా పడుకున్న తీరు గంజాయి మత్తు కలిగించే వినాశకర స్థితిని కళ్లకు కడుతోంది.

భర్త అత్యాచారం చేస్తే భార్య వీడియో తీసి..

కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువతి (22) తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో ఎల్ఎల్బీ కోర్సు చేస్తుంది. తోటి విద్యార్థిని ప్రణవకృష్ణ (35)తో ఆమెకు స్నేహం కుదిరింది. దీంతో ఆ యువతి ప్రణవకృష్ణ ఇంటికి వెళ్లేది. గంజాయి అలవాటు ఉన్న ప్రణవకృష్ణ, ఆమె భర్త కృష్ణకిషోర్‌రెడ్డి.. ఆ యువతికీ గంజాయి ఇచ్చారు. ఆ మత్తులో ఉన్న ఆమెను కిషోర్‌రెడ్డి అత్యాచారం చేయగా, ప్రణవకృష్ణ వీడియో తీసింది. తర్వాత వీడియోను యువతి కుటుంబ సభ్యులకు పంపించి, డబ్బులు డిమాండ్ చేశారు. 2024 జూలైలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దంపతుల్ని అరెస్టు చేశారు.

మత్తు ఎక్కువై.. రైలు పట్టాలపైనే..

2024 అక్టోబరులో పీలేరుకు చెందిన కిరణ్, యాసిన్ అలీ అనే యువకులు గంజాయి మత్తులో పట్టాలపై ఉన్నారు. ఈక్రమంలో రైలు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయారు. గతేడాది డిసెంబరులో కలికిరి రైల్వేట్రాక్‌పై ఇదే తరహాలో సోమలకు చెందిన మునికుమార్, కలికిరికి చెందిన వీరభద్రయ్యలు కూడా మరణించారు.

మత్తులో అసభ్య ప్రవర్తన

జీడీనెల్లూరు మండలం కొండకిందవూరు సమీపంలో ఆరుగురు యువకులు గతనెలలో మద్యం, గంజాయి మత్తులో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

గంజాయితో నష్టాలెన్నో?

గంజాయి నుంచి విడుదలయ్యే టెట్రాహైడ్రోకానాబినాల్ (టీహెచ్‌సీ) రసాయనం మత్తును పెంచుతుంది.

పీల్చిన వెంటనే టీహెచ్‌సీ రక్తంతో పాటు మెదడుకు చేరుకుంటుంది. అక్కడి న్యూరాన్లు అదుపు తప్పుతాయి.

బైపోలార్ డిజార్డర్ సమస్య తలెత్తుతుంది

నిరాశ, మానసిక సమస్యలకు దారి తీస్తుంది. ఆత్మహత్య ఆలోచనలు పెరుగుతాయి.

క్యాన్సర్ ముప్పు అధికంగా ఉంటుంది.

ఊపిరితిత్తులనూ ప్రభావితం చేస్తుంది.

జ్ఞాపకశక్తి, తెలివితేటలు తగ్గిపోతాయి.

అధిక మోతాదులో తీసుకున్నప్పుడు. ఎవరైనా ఏదైనా చేసేస్తారేమో అనే భయం వెంటాడుతుంది.

చాలావరకు తగ్గింది.. ఇంకా తగ్గిస్తాం

గంజాయికి బానిసగా మారిన వారి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ దెబ్బతింటుంది. తీవ్ర బానిసలుగా మారినవారితో సమాజానికి నష్టం కూడా కలుగుతుంది. తీవ్ర నేరాలకూ పాల్పడతారు. గంజాయికి విద్యార్థులు దూరంగా ఉండాలి. ఇప్పటికే వాడకం చాలావరకు తగ్గుతోంది. మరితం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి అమ్ముతున్నా, వినియోగిస్తున్నా పోలీసులకు సమాచారమివ్వండి.

– తుషార్ డూడీ, చిత్తూరు జిల్లా ఎస్పీ

విచక్షణ కోల్పోతారు

మన వద్ద గంజాయిని స్మోకింగ్ విధానంలో తీసుకుంటున్నారు. తొలుత తోటి విద్యార్థులు, స్నేహితుల ద్వారా అలవాటు ప్రారంభమవుతుంది. మోతాదు పెరిగితే ఏం చేయాలి, ఏం చేస్తున్నామనే విచక్షణ ఉండదు. మర్డర్, రేప్ వంటి చర్యలకు పాల్పడతారు. నన్ను ఎవరో ఏదో చేసేస్తారనే ఆలోచనలు ఎక్కువ అవుతాయి. దాంతో వాళ్లు ఎదుటి వ్యక్తుల్ని ఇబ్బంది పెట్టేస్తారు. గంజాయిపై అవగాహన కల్పించడానికి ముందే అది ఎక్కడా దొరక్కుండా కట్టడి చేయాలి.

– డాక్టర్ దినేష్, మానసిక వైద్య నిపుణుడు,

అపోలో ఆస్పత్రి, చిత్తూరు

సమాజానికి ఏ రకంగానూ పనికిరారు

గంజాయి తీసుకునేవారు ఏ పనీ చేయరు. ఎవరితో కలవరు. ఇంట్లో చిల్లర దొంగతనాలు చేస్తారు. అడిగింది ఇవ్వకుంటే క్రిమినల్, యాంటీ సోషల్ యాక్టివిట?సలో పాల్గొంటారు. పక్కనున్న వారికీ అలవాటు చేయించి పాడు చేస్తారు. నార్మల్ అయ్యేవరకు ఏరకంగానూ పనికిరారు. అలాంటి వారు సడన్‌గా ఎవరితోనూ కలవకుండా, తేడాగా మారిపోతే గుర్తించి మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి. కచ్చితంగా మందులు వాడాలి. తల్లిదండ్రుల సపోర్టు బాగుంటే త్వరగా కోలుకుంటారు.

# చందు టెన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి క్రికెట్ టోర్నమెంట్..




ఎన్ టి ఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 18(క్రైం కౌంటర్ డెస్క్): మహాశివరాత్రి సందర్భంగా చందు టెన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గొర్రెపాటి విజయ్ చంద్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు.నాలుగు రోజులుగా సాగిన ఈ టోర్నమెంట్ కి దాతలు ట్రుజోన్ సోలార్,మికాస ప్లేవుడ్ మరియు వీణా డిజైనర్స్ బోటిక్స్ సహకారంతో రాత్రి సమయంలో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఐపిఎల్ తరహాలో క్రీడాకారులను కొనుక్కోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ టోర్నమెంట్ లో 8 టీమ్ లను ఎంచుకొని 80 మంది క్రీడాకారులతో 15 మ్యాచ్ లను నిర్వహించారు.ఫైనల్ మ్యాచ్ లో సాగర్ లెవెన్ పై ఎన్ పి ఎల్ టైగర్స్ టీమ్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.ఈ సందర్భంగా ట్రుజెన్ సోలార్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్,మికాస ప్లేవుడ్ రీజనల్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ శివరాత్రి రోజున ఇలాంటి క్రీడలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని మీడియా కి వ్యక్తపరిచారు.ఇదేవిధంగా ప్రతి సంవత్సరం దాతల సహకారంతో,క్రీడాకారుల ప్రోత్సాహంతో నిర్వహిస్తామని నిర్వాహకులు గొర్రెపాటి విజయ్ చంద్ తెలిపారు.

# సీబీజీ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఐఏఎస్

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు చేయూతనిస్తాయన్నా ప్లాంట్ నిర్వాహకులు..



ఎన్టీఆర్ జిల్లా,పరిటాల,ఫిబ్రవరి 18(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):కంచికచర్ల మండలం,పరిటాలలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్ న్యూ ఎనర్జీ – కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం సందర్శించారు. 30 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్లాంటును త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించే అవకాశమున్నందున ప్లాంటులో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకు 22 టన్నుల సీబీజీ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంటును సిద్ధం చేస్తున్నట్లు ప్లాంటు సిబ్బంది వివరించారు. స్థానిక వ్యవసాయ వ్యర్థాలు, మునిసిపల్ ఘన వ్యర్థాలు వంటి వాటిని ఉపయోగించి పర్యావరణ హిత ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు ఇలాంటి ప్లాంటులు దోహదం చేస్తాయన్నారు. ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కూడా చేయూతనిస్తాయన్నారు. కర్బన ఉద్గారాలకు కళ్లెం వేయడంతో పాటు రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీబీజీ ప్లాంట్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, సంస్థ డీజీఎం శ్రీకాంత్, మేనేజర్ శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిట్టిబాబు ఉన్నారు.

# ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో ప్రమాదం

క్రైం కౌంటర్ న్యూస్, రాంబిల్లి, ఫిబ్రవరి 18 అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని ఎస్ఈజడ్‌లో వున్న ఇన్నోవేర్ ల్యాబ్స్ కంపెనీలో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో ఒక కెమిస్టు మృతిచెందాడు. మరో ఉద్యోగికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి సీఐ సీహెచ్.నరసింగరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు గ్రామానికి చెందిన బొద్ద అజయ్‌కుమార్ (21) సుమారు రెండేళ్ల నుంచి అచ్యుతాపురం సెజ్‌లోని ఇన్నోవేర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కెమిస్టుగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 'సి' షిఫ్ట్‌కు హాజరయ్యాడు. సుమారు 10.30 గంటల సమయంలో అమ్మోనియా గ్యాస్ సిలిండర్ పేలడంతో సమీపంలో విధులు నిర్వహిస్తున్న అజయ్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. షిఫ్ట్ ఆపరేటర్ జె.పోతురాజుకు గాయాలయ్యాయి. ఇతనిని చికిత్స నిమిత్తం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ నరసింగరావు, పోలీసు సిబ్బందితో కంపెనీకి వెళ్లి పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అజయ్‌కుమార్ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించి, బుధవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా ఇన్నోవేర్ ల్యాబ్స్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఉద్యోగి అజయ్‌కుమార్ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారంగా ఇవ్వాలని సీఐటీయూ నాయకులు ఆర్.రాము, జి.దేముడునాయుడు, కె.సోమునాయుడు డిమాండ్ చేశారు.

# జానకిరామపురం పీఏసీఎస్ సీఈవో డిస్మిస్



క్రైం కౌంటర్ న్యూస్, నర్సీపట్నం, ఫిబ్రవరి 18 రోలుగుంట మండలం జానకిరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈవోగా పనిచేసిన బీవీవీవీఎస్‌ఆర్‌జీ రామకృష్ణను విధుల నుంచి తొలగిస్తూ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఉత్తర్వులు జారీ చేశారు. సహకార సంఘానికి చెందిన లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ కావడంతో ఆయనపై వేటు వేశారు.

జానకిరామపురం పీఏసీఎస్‌లో సీఈవోగా పని చేసిన రామకృష్ణ సొసైటీ డబ్బులు సొంత అవసరాలకు వాడుకొన్నట్టు ఆరోపణలు వచ్చాయి. పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో సహకార శాఖ అధికారులు స్పందించారు. ఇతనిపై వచ్చిన ఐదు ఆరోపణలపై శాఖాపరమైన విచారణ చేశారు. బోర్డు అనుమతి తీసుకోకుండా సొసైటీ నిధులు రూ.16,35,492 సొంత అవసరాలకు వాడుకొన్నట్టు విచారణలో తేలింది. ఇంకా ఓచర్స్ లేకుండా రూ.24,500 వాడుకున్నారు. పంట రుణాలను సకాలంలో వసూలు చేయలేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో సుమారు ఏడాది క్రితం రామకృష్ణను సస్పెండ్ చేశారు. ఈ సమయానికి ఆయన వద్ద వున్న సొసైటీ నిధులు రూ.6 వేలను తర్వాత విధుల్లో చేరిన కార్యదర్శికి అప్పగించ లేదు. గత ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన నర్సీపట్నం డీసీసీసీ బ్రాంచ్‌లోకి పెట్రోల్ క్యాన్‌తో ప్రవేశించి, బ్రాంచ్ మేనేజర్, సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడినట్టు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనను పోలీసులు అరెస్టు చేయగా, 75 రోజులు రిమాండ్‌లో ఉన్నారు. ఈ సంఘటనపైనా సహకార అధికారులు విచారణ జరిపారు. దీంతో రామకృష్ణను ఉద్యోగం నుంచి తొలగిస్తూ పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి బలిజి మహరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం డీసీసీసీ బ్రాంచ్ ఘటనలో ఇతనికి సహకరించిన పీఏసీఎస్ గుమస్తా దేవుడుని కూడా విధుల నుంచి తొలగించారు.

# అన్నదాతలకు గండి గుబులు

**మూడు నెలలు దాటినా మొదలుకాని పునరుద్ధరణ పనులు**

**శారదా నది ఉధృతికి తగరంపూడి వద్ద గత ఏడాది కోతకు గురైన గండి**

**సందర్శించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి**

**త్వరలో గట్టు పునరుద్ధరణ పనులు చేపడతామని హామీ**

**ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిన అధికారులు**

**ఇంతవరకు మొదలుకాని పనులు**



క్రైం కౌంటర్ న్యూస్, చోడవరం, ఫిబ్రవరి 18 మండలంలోని భోగాపురం సమీపంలో శారదా నది వరద ఉధృతితో కోతకు గురైన తగరంపూడి గ్రోయిన్ వద్ద గట్టు పునరుద్ధణ పనులు ఇంతవరకు ప్రారంభం కాకపోవడంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఈ ప్రదేశాన్ని పరిశీలించి, వరద గట్టు పునరుద్ధరణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పి మూడున్నర నెలలు దాటినా అతీగతీలేదు.

మండలంలోని భోగాపురం వద్ద పెద్దేరు నది శారదా నదిలో కలుస్తుంది. దీంతో ఇక్కడ వర్షాకాలంలో వరద ఉధృతి అధికంగా వుంటుంది. కాగా గత ఏడాది అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు పెద్దేరు, శారదా నదులు ఉగ్రరూపం దాల్చాయి. భారీ మొత్తంలో వరద రావడంతో భోగాపురం సమీపంలో తగరంపూడి గ్రోయిన్ ధ్వంసమైంది. దీనిని ఆనుకొని వున్న గట్టు కోతకు గురై భారీ గండి పడింది. రహదారిగా వినియోగించే గట్టు కోతకు గురవడంంతో భోగాపురం, పీఎస్‌పేట, చాకిపల్లి, రామజోగిపాలెం గ్రామాల రైతులు తమ పంటపొలాలకు వెళ్లేందుకు రహదారి లేకుండా పోయింది. కొద్ది రోజుల తరువాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ఇక్కడకు వచ్చి పరిశీలించారు. వరద గట్టు పునరుద్ధరణ పనులు త్వరలో చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు. అంతరం ఇరిగేషన్ అధికారులు వచ్చి శాశ్వత పనులకు, తాత్కాలిక పనులకు వేర్వేరుగా ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. ఇది జరిగి మూడు నెలలు దాటినప్పటికీ ఇంతవరకు వరద గట్టు పునరుద్ధరణ పనులు మొదలు కాలేదు. మరో నాలుగు నెలల్లో వర్షాకాలం వస్తుంది. వెంటనే పనులు మొదలుపెట్టి, వేసవిలోగా పూర్తిచేయకపోతే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వరద నీరు తమ పొలాలను ముంచెత్తుతుందని రైతులు వాపోతున్నారు.

# సినిమా



## జగపతిబాబు కామెంట్స్ వైరల్

టాలీవుడ్ వెండితెరపై జగపతిబాబు, సౌందర్య లది సూపర్ హిట్ జోడీ. వీరి కాంబినేషన్ లో పలు సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా ఈ జోడీ నటించిన సినిమాలు ఫ్యామిలీ ఆడియెన్స్ కు తెగ నచ్చేశాయి. పెళ్లి పీటలు, ప్రియరాగాలు, సర్దుకుపోదాం రండి, దొంగాట, అంతఃపురం.. ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో కలిసి నటించారు సౌందర్య, జగ్గూబాయ్. సినిమాల్లోనే కాదు ఆఫ్ స్క్రీన్ లోనూ ఈ ఇద్దరికీ మంచి స్నేహం ఉండేది. ఈ నేపథ్యంలో సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని ఇప్పటికే పలు సందర్భాల్లో పంచుకున్నారు జగ్గూభాయ్. అయితే సౌందర్యతో పాటు ఆమె సోదరుడు అమర్నాథ్ కూడా జగపతిబాబుకు మంచి స్నేహితుడట. ఆ స్నేహం వల్లే వీరి కుటుంబాల మధ్య కూడా మంచి అనుబంధం ఏర్పడిందట. ఈ విషయాన్ని స్వయంగా జగ్గూభాయే ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అదే సమయంలో హెలికాప్టర్ ప్రమాదంలో సౌందర్య, అమర్నాథ్ చనిపోయినప్పటి చేదు జ్ఞాపకాలను ఓ సందర్భంలో షేర్ చేసుకున్నారు.

2004లో జరిగిన ఓ హెలికాప్టర్ ప్రమాదంలో సౌందర్యతో పాటు ఆమె సోదరుడు అమర్నాథ్ కూడా కన్నుమూసిన సంగతి తెలిసిందే. దీని గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన జగపతిబాబు.. ‘ ఆరోజు నాకు ఫోన్ వచ్చింది.. సౌందర్య చనిపోయిందని చెప్పారు. ఆ సమయంలో నేను విదేశాల్లో ఉన్నాను. వెంటనే నేను అమర్ (సౌందర్య సోదరుడు) ఎలా ఉన్నాడు అని అడిగాను. అతనికి ఏమైనా జరిగితే మాత్రం నాకు చెప్పొద్దు అని వెంటనే ఫోన్ పెట్టేశాను. కానీ విధి చాలా బలీయమైనది, ఆ ప్రమాదంలో సౌందర్యతో పాటు అమర్‌నాథ్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ప్రాణ స్నేహితుడిని కోల్పోవడం తనను సగం చంపేసినంత పని చేసింది’ అని జగపతిబాబు ఎమోషనల్ అయ్యారు.

కాగా ప్రస్తుతం సౌందర్య తల్లితో కానీ, ఆమె కుటుంబ సభ్యులతో తాను టచ్‌లో లేనని నటుడు జగపతి బాబు తెలిపారు. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు చాలా మారిపోయాయని ఆయన అన్నారు. అయితే సౌందర్య తల్లి ప్రస్తుత పరిస్థితి గురించి నేరుగా తెలియకపోయినా, ఆమె బాగానే ఉన్నారని విన్నానని జగ్గూభాయ్ చెప్పారు. గతంలో వారి కుటుంబంలో ఆస్తి సంబంధిత సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని, అయితే అవి ఇప్పుడు పరిష్కారమయ్యాయని తాను విన్నానని జగపతి బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం సౌందర్యతో ఆమె ఫ్యామిలీపై ఈ సీనియర్ నటుడు చేసిన కామెంట్స్ నెట్టింట బాగా వైరలవుతున్నాయి.





## భోజనం తర్వాత హోటళ్లలో సోంపు ఎందుకు ఇస్తారో తెలుసా?

భోజనం తర్వాత సోంపు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు లెక్కకు మించి ఉన్నాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి రక్త ప్రసరణ, కంటి ఆరోగ్యం వరకు సోంపు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకు ప్రతి ఇంటి వంట గదిలో ఇది తప్పక ఉంటుంది. అలాగే హోటళ్లలో భోజనం తర్వాత ప్లేట్‌లో సోంపు, చక్కెర వడ్డిస్తారు. ఇది కేవలం ఆతిథ్య మర్యాద మాత్రమే కాదు, దీని వెనుక గొప్ప ఆరోగ్య శాస్త్రం ఉంది. చాలా మంది దీనిని కేవలం నోరు శుభ్రం చేసుకునేందుకు ఉపయోగపడే పదార్థంగా భావిస్తారు. కానీ సోంపు ఔషధ గుణాల నిధి. సోంపులో ఉండే సహజ నూనెలు కడుపులో జీర్ణ రసాల స్రావాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. మీరు అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటే భోజనం తర్వాత కొంచెం సోంపు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.అలాగే భోజనం తిన్న తర్వాత నోటిలో బ్యాక్టీరియా పేరుకుపోతుంది. దీనివల్ల దుర్వాసన వస్తుంది. మెంతులలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఈ క్రిములను చంపుతాయి. ఇది శ్వాసను తాజాగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. నేటి వేగవంతమైన జీవితంలో అసిడిటీ సమస్య సర్వసాధారణంగా మారింది. శరీరంలో పిత్తాన్ని తగ్గించడానికి సోంపు సహాయపడుతుంది. తరచుగా గుండెల్లో మంటతో బాధపడేవారికి, సోంపు తినడం సహజమైన, ప్రభావవంతమైన నివారణ అని నిపుణులు సూచిస్తున్నారు.

సోంపులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిలోని విటమిన్ ఎ కంటి దృష్టిని మెరుగుపరచడానికి సహజ పోషకంగా పరిగణించబడుతుంది. సోంపు శరీరం నుంచి విషపూరిత అంశాలను తొలగించడం ద్వారా రక్తాన్ని శుద్ధి చేయడానికి కూడా పనిచేస్తుంది. ఇది చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. సోంపు రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. అందుకే భోజనం తర్వాత మీ రోజువారీ అలవాట్లలో సోంపు చేర్చుకోవడం వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.



## అమ్మబాబోయ్.. పెద్ద కథే ఉందిగా..

చికెన్ అంటే చాలు.. నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి తింటారు.. చికెన్ ఫ్రై, కర్రీ, తందూరి, చికెన్ పచ్చడి.. ఇలా ఎన్నో రకాలుగా చేసుకుని ఇష్టంగా తింటారు. అయితే.. కొందరికి ముక్క లేనిదే ముద్ద దిగదు.. అవును.. చాలా మంది డైలీ నాన్ వెజ్ తినడాన్ని ఇష్టపడతారు.. ఇక కొందరైతే డైలీ చికెన్ ను తింటారు.. చికెన్ లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. మంచి ప్రోటీన్ వనరుగా కోడి మాంసం గుర్తింపు పొందింది.. అయితే ప్రతిరోజూ చికెన్ తినడం ఆరోగ్యకరమేనా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. డైటీషియన్ల ప్రకారం.. చికెన్ మంచిదే అయినప్పటికీ, దానిని ప్రతిరోజూ తీసుకోవడం సరికాదని సూచించారు. వారానికి ఒకటి లేదా రెండుసార్లు, లేదా గరిష్టంగా మూడుసార్లు మాత్రమే తీసుకోవడం ఆరోగ్యానికి ప్రయోజనకరమని పేర్కొంటున్నారు.చికెన్‌లో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి: దేశీ చికెన్ (నాటు కోడి), బాయిలర్ చికెన్. పోషకపరంగా దేశీ చికెన్‌కే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటున్నారు. దేశీ చికెన్‌లో ప్రోటీన్ కంటెంట్ బాయిలర్ చికెన్ కంటే అధికంగా ఉంటుంది. ఉదాహరణకు, దేశీ చికెన్‌లో 100 గ్రాముల ప్రోటీన్ లభిస్తే, బాయిలర్ చికెన్‌లో కేవలం 50-60 గ్రాముల వరకు మాత్రమే లభించే అవకాశం ఉంది. అధిక ప్రోటీన్ కలిగిన దేశీ చికెన్ శరీరాన్ని బలోపేతం చేయడానికి, వెన్నెముకకు మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుంది. అయితే.. బ్రాయిలర్ చికెన్ తో పోలిస్తే.. దేశీ చికెన్ ధర ఎక్కువగా ఉంటుంది. ఇటు ఆర్థికంగా.. అటు శరీర అవసరాలకు అనుగుణంగా చికెన్ ను ఎంచుకోవడం ఉత్తమం..

చికెన్ తయారీ పద్ధతి కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. రోటీ, ఉడకబెట్టిన, గ్రిల్డ్ లేదా తందూరి చికెన్ వంటివి తీసుకోవచ్చు.. కానీ అధికంగా మసాలాలు వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చికెన్ వండేటప్పుడు రుచి, వాసన కోసం చాలామంది మసాలాలను అధికంగా ఉపయోగిస్తారు. అయితే, ఈ మసాలాలు క్యాన్సర్ కణాల పెరుగుదలకు దారితీయవచ్చని, క్యాన్సర్ లేనివారిలో కూడా దీనికి అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని నివారించడానికి, రుచి కోసం ఇంట్లో తయారుచేసిన ధనియాల పొడి, మిరియాల పొడి, కరివేపాకు పొడి వంటి సహజ మసాలాలను ఉపయోగించవచ్చు.. బయట లభించే ప్యాక్డ్ మసాలాలను వీలైనంతవరకు తగ్గించడం మంచిది.ప్రతిరోజూ చికెన్ తింటే ఏమవుతుంది..

ప్రతిరోజూ చికెన్ తినడం వల్ల శరీరం దానిని భరించలేకపోవచ్చు.. జీర్ణక్రియ సమస్యలు తలెత్తవచ్చు. కొందరు “చికెన్ తింటే వేడి చేస్తుంది” లేదా “పడట్లేదు” అని చెబుతుంటారు. దీనికి కారణం తరచుగా అధిక మసాలాలు, నూనెతో కూడిన వంటకాలు లేదా రోజువారీ తీసుకోవడమేనని నిపుణులు పేర్కొంటున్నారు.. అధికంగా తీసుకుంటే జీర్ణం కాకపోవడమే కాకుండా, చికెన్‌పై ఆసక్తి కూడా తగ్గిపోతుంది.

## ట్వంటీ20 వరల్డ్ కప్.

టీ20 వరల్డ్ కప్ 2026లో గ్రూప్ స్టేజ్ చివరి అంకానికి చేరుకుంది. ఇప్పటికే వరుసగా మూడు విజయాలతో అజేయంగా నిలిచి, సూపర్-8 బెర్తును ఖరారు చేసుకున్న టీమిండియా.. బుధవారం తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడుతోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. సూపర్-8లో సౌతాఫ్రికా వంటి బలమైన జట్టుతో తలపడనున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను భారత్ ఒక ప్రాక్టీస్ సెషన్‌లా భావిస్తోంది. మరోవైపు ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన నెదర్లాండ్స్.. పటిష్టమైన భారత్‌ను ఓడించి గౌరవప్రదంగా ఇంటికి వెళ్లాలని చూస్తోంది.ఈ మ్యాచ్ ముఖ్యంగా టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు చావోరేవో లాంటిది. ఈ వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. పాకిస్థాన్, అమెరికా వంటి జట్లతో జరిగిన కీలక పోరుల్లో అభిషేక్ కనీసం ఖాతా తెరవకుండానే (డకౌట్) పెవిలియన్ చేరాడు. సూపర్-8లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే నెదర్లాండ్స్‌పై భారీ స్కోరు సాధించడం అతనికి ఎంతో ముఖ్యం. అహ్మదాబాద్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది కాబట్టి, అభిషేక్ తన పాత ఫామ్‌ను అందిపుచ్చుకుంటాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా ఫీల్డింగ్‌లో ఒక అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. టీ20ల్లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన భారతీయుడిగా రోహిత్ శర్మ (65 క్యాచ్‌లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించేందుకు హార్దిక్ (63 క్యాచ్‌లు)కు మరో మూడు క్యాచ్‌లు మాత్రమే అవసరం. చరిత్ర పరంగా చూస్తే భారత్ నెదర్లాండ్స్ జట్లు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు నాలుగు సార్లు తలపడగా.. ఆ నాలుగు సార్లూ టీమిండియానే విజయం వరించింది. 100 శాతం విన్నింగ్ రికార్డుతో ఉన్న భారత్, ఈ మ్యాచ్‌లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అహ్మదాబాద్ స్టేడియంలో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉన్నందున, అభిమానులకు పరుగుల విందు ఖాయమనిపిస్తోంది. సూపర్-8 రౌండ్‌కు వెళ్లే ముందు భారత్ తన విజయ పరంపరను ఇలాగే కొనసాగించాలని పట్టుదలగా ఉంది.




## సాహిబ్‌జాదా ఫర్హాన్ ఊచకోత.

టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్ జట్టు ఎట్టకేలకు ఊపిరి పీల్చుకుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో నమీబియాపై 102 పరుగుల భారీ విజయంతో ఘనంగా సూపర్-8 రౌండ్‌లోకి దూసుకెళ్లింది. కొలంబో వేదికగా జరిగిన ఈ పోరులో పాక్ బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించి పసికూనను మట్టికరిపించారు. ఈ గెలుపుతో ఈ మెగా టోర్నీలో సూపర్-8కు చేరిన ఎనిమిదో, ఆఖరి జట్టుగా పాకిస్థాన్ నిలిచింది. ఇప్పటికే భారత్, జింబాబ్వే సహా ఏడు జట్లు తదుపరి రౌండ్‌కు చేరుకోగా, ఇప్పుడు పాక్ కూడా ఆ జాబితాలో చేరింది.

ఈ మ్యాచ్‌లో పాక్ విజయంలో ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ హీరోగా నిలిచాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే నమీబియా బౌలర్లపై విరుచుకుపడ్డ ఫర్హాన్.. కేవలం 58 బంతుల్లోనే 100 పరుగులు చేసి సెంచరీ మార్కును అందుకున్నాడు. అతనికి తోడుగా కెప్టెన్ సల్మాన్ ఆగా 38 పరుగులతో రాణించగా, ఆఖర్లో షాదాబ్ ఖాన్ కేవలం 22 బంతుల్లోనే 1 ఫోర్, 3 సిక్సర్లతో 36 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 199 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అనంతరం 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియాకు పాక్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఆది నుంచే వికెట్లు కోల్పోతూ వచ్చిన నమీబియా జట్టు ఏ దశలోనూ పాక్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. పాక్ బౌలర్ల ధాటికి నమీబియా కేవలం 97 పరుగులకే కుప్పకూలింది. దీంతో పాక్ 102 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుని టోర్నీలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఈ విజయంతో పాక్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.పాకిస్థాన్ సూపర్-8కు క్వాలిఫై అవ్వడంతో ఇప్పుడు మరోసారి భారత్ -- పాక్ హైవోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్ దశలో భారత్ చేతిలో ఓడిపోయిన పాకిస్థాన్, ఇప్పుడు సూపర్-8లో ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. ఈ నెగ్గుకు రావడంతో టోర్నీలో అసలు సిసలు మజా మొదలైందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com